క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హరినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

శివాలయంలో అన్నదానం



శంషాబాద్ రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దగోల్కొండలోని శ్రీ భగీరథ శివాలయంలో స్వామి కల్యాణం అనంతరం సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ స్వరూప నర్సింహగౌడ్, అన్నదాత శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుమారుడి జ్ఞాపకార్థం..



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న రాజేశ్వరి

మణికొండ: కుమారుడి జ్ఞాపకార్థం అతడి తల్లిదండ్రులు పేద విద్యార్థుల ఆకలి తీర్చారు. గండిపేటలోని ఈపీఎల్ అపిల గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్న రాజేశ్వరి, రాజుయాదవ్ దంపతుల కుమారుడు సాయి చరణ్ గతంలో ప్రమాదంలో మరణించాడు. ఈ నేపథ్యంలో అతడి వర్ధంతి సందర్భంగా గండిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 400 పేద విద్యార్థులకు సోమవారం మధ్యాహ్నం భోజనం పెట్టారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ గోపాల సునీత గణేష్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

రాజేంద్రనగర్: ఢిల్లీలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నివాసంపై దాడికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత, బీసీ, మైనార్టీలపై ఎక్కడ దాడులు జరిగిన మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నిస్తూ వారి పక్షాన నిలబడుతున్నారన్నారు. వారిలో మనో స్థైర్యాన్ని నింపేందుకు న్యాయపరంగా పోరాడుతున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలోని ఆయన నివాసంపై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

ఫేస్‌బుక్‌లో అమ్మకానికి ఆవులు

ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేసి టోకరా

శంషాబాద్ రూరల్: ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన ఆవులను కొనుగోలు చేసేందుకు ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి మోసం పోయిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన సోనుకుమార్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆవులను అమ్మకానికి పెట్టాడు. ఈ ఫొటోలను చూసిన చార్మినార్ ప్రాంతానికి చెందిన అనిల్ శర్మ మూడు ఆవులను రూ.59వేలకు కొనుగోలు చేసేందుకు సోనుకుమార్‌తో బేరం కుదుర్చుకున్నాడు. ఇందుకుగాను రెండు దఫాలుగా రూ.38వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఆవులను నగరానికి పంపేందుకు సోనూకుమార్ మరికొన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన శర్మ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



గౌలిపురా: మాఘ మాస సోమావతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో సోమవారం పరమశివుడికి విశేష పూజలు, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదానం చేశారు. సంఘం చైర్మన్ శ్రీరాం కోటయ్యగుప్తా, సలహాదారులు చీల రాములుగుప్తా, సరాబు విశ్వేశ్వరయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి మహోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అర్చకులు, ప్రణవ భక్త సమాజం సభ్యులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్, రాంబాగ్ చిన్న అనంతగిరి దేవాలయం నిర్వహించిన మహాశివరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సమాజం ఆధ్వర్యంలో పురోహితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు ఎం.నర్సింహ, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సనివెల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల ఆశోక్, జాయింట్ సెక్రటరీ కొండమీది హరినాథ్, రావుల గండయ్య, కోశాధికారి హరినాథ్, సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కోలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మోంగ్ర కొమురయ్య, ప్రచార కార్యదర్శి మోంగ్ర ఐలయ్య, కమిటి సభ్యులు సాబాద విజయ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, శ్రీరాములు, సోమారం సురేష్, సులిగే ఆశోక్, తాటి రాజు, ఎల్.వెంకటేష్, కె.కిరణ్‌చారి, కె.కృష్ణ, రావుల జగన్, మ్యాడం రాము, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి శ్యామల

రాజేంద్రనగర్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి శ్యామల అన్నారు. హైదర్‌గూడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శక్తి కేంద్రం ఇన్‌చార్జి సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాన్ని దోచుకుంటూ కుటుంబ పాలన కొనసాగిస్తున్నారన్నారు. పాలకుల తీరుపై ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి మోంగ్ర కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంగ్ర సంగీతగౌరీశంకర్, రాచూరి రాజశేఖర్, కాడెం సుధాకర్, మల్లేష్‌యాదవ్, బి.సిద్ధేశ్వర్, సంతోష్, సాయివంశీ, రాకేష్, శ్రీకాంత్‌చారి, వాసు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అధిక పన్నులను తగ్గించాలి



మాట్లాతున్న కోకాపేట కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి

మణికొండ: మున్సిపాలిటీలో ఇష్టారాజ్యంగా ప్రజలపై మోపుతున్న ఇంటి పన్ను, నల్లా నీటి పన్నులను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 7,8,13,14 బూత్‌లలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కోకాపేటలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతియాదవ్ ధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పన్నుల భారం మోపడం దారుణమన్నారు. పేద ప్రజలకు గత ప్రభుత్వాలు ఇంటి స్థలాలు ఇస్తే ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి భూములను లాక్కుని బడా బాబులకు అంటగడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూం గృహాలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఇవ్వకపోవటం సిగ్గు చేటన్నారు. రాబోయే ఎన్నికల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు రానివారు బీజేపీకి మద్దతు పలకాలని, బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ఒక్కరికి ఇంటిని కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, బూత్ అధ్యక్షులు కె. చెన్నయ్య, జి. విక్కీ ముదిరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్ కుమార్, నాయకులు పీసరి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, డి. నాగేష్, డి. శ్రీనివాస్, కె. సురేందర్‌ముదిరాజ్, జి. శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

నిర్మాణాల కూల్చివేత.. ఇరువర్గాల ఫిర్యాదు

శంషాబాద్: పట్టణంలోని జాతీయరహదారి పక్కనే సర్వేనంబరు 24లోని అర ఎకరం భూమిపై కొంత కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. సదరు భూమిలో కొందరు వ్యక్తులు తమకు చెందినంటూ ఇటీవల నిర్మాణాలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున అక్కడికి వచ్చిన కొందరు వ్యక్తులు రెండు గదులను నేలమట్టం చేసినట్లు ఓ వర్గం ఫిర్యాదు చేయగా మరో వర్గం నేతలు ఇందులో తమ ప్రమేయం లేదని భూమిపై తమకే సర్వహక్కులున్నాయంటూ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



రవి (ఫైల్)

శంషాబాద్ రూరల్: చుట్టపు చూపుగా అక్క వద్దకు వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లోని ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన ముడావత్ రవి ఈ నెల 7న చిన్నగోల్కొండలో ఉన్న తన అక్క కేతావత్ సోని ఇంటికి వచ్చాడు. ఈ నెల 12న సోనీ తన భర్తతో కలిసి మైసిగండికి వెళ్లింది. ఈ క్రమంలో రవి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



అహ్మద్(ఫైల్)

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన అహ్మద్(28) ఫర్నీచర్ తయారీ దుకాణంలో పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం అతడి భార్య డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం దుకాణం నుంచి వచ్చిన అహ్మద్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



అధితి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి హౌజింగ్‌బోర్డు కాలనీలో పప్పుకుమార్, అధితి(19) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 19న అధితి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టినా ఆచూకీ తెలియరాలేదు.దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న రవి

మైలార్‌దేవ్‌పల్లి: అర్ధ రాత్రి షికారుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు లారీ ఢీనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రోహిత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు చందానగర్ ప్రాంతానికి చెందిన రవి, తన స్నేహితురాలితో కలిసి సోమవారం తెల్లవారుజామున ఓల్డ్ కర్నూల్ రోడ్డు మీదుగా బైక్‌పై చందానగర్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో దుర్గానగర్ నుంచి కాటేదాన్ వెళ్తున్న లారీ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రవికి తలకు తీవ్రగాయాలు కాగా అతడి స్నేహితురాలికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని కూకట్‌పల్లి రెమిడీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన కాలువ పైకప్పు

రాజేంద్రనగర్: నాలపైకప్పు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెండ్యాల సాయిమాలిక్ గోతిని పరిశీలించి దీనిని పూడ్చాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ జలమండలి కార్యాలయ సమీపంలో గత కొంత కాలంగా మురుగునీటి కాలువ పైకప్పు శిథిలావస్థకు చేరుకుందన్నారు. ప్రధాన రహదారి పక్కనే ఈ గోతి ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు, పాదచారులు తరచు గోతిలో పడి గాయపడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.



ప్రమాదకరంగా మారిన గోతిని పరిశీలిస్తున్న పెండ్యాల సాయిమాలిక్

విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



యాగంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని విజయగణపతి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ఉదయం అభిషేకం, అలంకరణ, శాంతి పాఠం, చతుర్వేద పారాయణం, మంటప దేవత పూజ, లఘురుద్ర మహాశత చండీ యాగ చండీ సప్తశతి విశేష సంకల్పం పారాయణం ప్రారంభం , రుద్ర శతచండీ యాగం, మహామంగళ హారతి, అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

దూద్‌బౌలి: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పుష్పలీల అన్నారు. సోమవారం టీపీసీసీ కార్యదర్శి ముజీబుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎనిమిదేళ్ల కుటుంబ పాలనతో ప్రజలు విసుగు చెందారని, ప్రజలు తిరిగి కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారన్నారు. పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేశ్‌బాబు, మహమూద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



జోడో యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల తదితరులు

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



ఆదర్శ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి రోజు కాలనీలు, బస్తీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదర్శనగర్ కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ప్యాచ్‌వర్క్, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, జగన్, మహేందర్‌రెడ్డి, చిన్నా, పాండుయాదవ్, చంద్రశేఖర్, ఏతం బల్వంత్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి



మనూ జట్టు సభ్యులతో వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అన్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నీకి ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులు సోమవారం వీసీని కలిశారు. ఈ సందర్భంగా వీసీ వారిని ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆటల్లోనే రాణిస్తే భవిష్యత్‌లో మరింత గుర్తింపు వస్తుందన్నారు. క్రికెట్ టోర్నీలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో జరగనున్న టోర్నీకి జట్టు సభ్యులు సోమవారం బయలు దేరి వెళ్లారు. ఎంపికైనవారిలో ఆఫ్నాన్, సాజిద్ మహమూద్, బషీర్ తాహెర్, సాకిబ్, సజాద్ అహ్మద్, మహ్మద్ హసన్, ఆరీఫ్ కలీమ్, తైబ్‌హుస్సేన్, బిలాల్, నౌషాద్, గోపి, యాసీన్, షైహ్వార్, ఎండీ అక్రమ్‌సిద్ధి ఉన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, డీపీఈ స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, ఏడీ యాజ్దాన్ రిజ్వాన్ పాల్గొన్నారు. మహ్మద్ హమీద్ జట్టు కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు.

శాంతిసరోవర్‌లో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ బికె ఈవి గిరీష్, శాంతిసరోవర్ డైరెక్టర్ బికె కుల్‌దీప్‌దీదీ, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ హేమావతిరామస్వామి పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ సంస్థ పతాకాలను చేతిలో పట్టుకుని ముగింపును లాంఛనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల సువర్ణ శోభిత శివలింగాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు. ద్వాదశజ్యోతిర్లింగాల సందర్శన, మెడిటేషన్ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టర్కీ భూకంప బాధితులకు ఔషధాలు



మందులు తీసుకెళ్తున్న వాహనానికి పచ్చజెండా ఊపుతున్న సోహెల్

గోల్కొండ: టర్కీ భూకంప బాధితులకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని సకీనా ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. టర్కీ భూకంప బాధితులకు సకీనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందులు సేకరించారు. వాటిని సోమవారం నగరంలోని టర్కీ ప్రభుత్వ రాయబార కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయులు ఎప్పుడూ ప్రపంచంలో ఏం జరిగినా బాధితులకు అండగా ఉంటారన్నారు. సునామీలు, తుఫానులు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత ప్రభుత్వంతో పాటు భారతీయులంతా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల విలువ చేసే మందులను పంపిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సకీనా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వెళ్లి సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

రాజేంద్రనగర్: ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో సోమవారం ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై.శ్రీధర్ మాట్లాడుతూ బస్తీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడమే గాక వాటి పరిష్కారానికి నాయకులు చొరవ చూపాలన్నారు. అధికార పార్టీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. అభివృద్ధికి నోచుకోని బస్తీలు, కాలనీల్లో పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, రైల్వే బోర్డు సభ్యులు జోగి రవి, డివిజన్ అధ్యక్షులు అడికే జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.ప్రసాద్, భరత్, భాస్కర్, కిషోర్, ఎడ్లకాడి రవి, ఏ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం



చెక్కును అందజేస్తున్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్త అఖిల్‌కు బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆర్థిక సాయం అందించారు. సోమవారం సన్నిహితుల ద్వారా విషయం తెలియడంతో కొండాపూర్‌లోని వారి కుటుంబసభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మెడికవర్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, రాయదుర్గంవాసులు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే రోగ నిరోధక శక్తి



రాజేందర్‌రావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తదితరులు

చార్మినార్: ప్రజలు తినే ఆహారం, జన్యువుల పరస్పరాగతంతోనే జన్యు మార్పులు ఏర్పడి స్థూలకాయానికి దారితీస్తుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్ (ఎన్ఐఎన్) శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రావు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్, రసాయనశాఖ అధిపతి డాక్టర్ ఏలూరి యాదయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థూలకాయంతో అంతర్గత అవయవాలు పనిచేయకపోవడంతో కేన్సర్, డయాబెటిస్ తదితర వ్యాధులకు దారితీసి మానవ మనుగడకు ముప్పుగా మారుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా మాట్లాడుతూ.. పండ్లు తినడం, ఉత్సాహంగా ఉండడంతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.దయానంద్, ఎ.వసంత, బుసి అనిల్‌కుమార్, శ్రీదేవి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ పర్వతాలు, డాక్టర్ తిరుపతి, సి.విద్య తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల ఆదరణ



కార్యక్రమంలో పాల్గొన్న మజ్లిస్ నాయకులు

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభిస్తోందని టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్ అన్నారు. సోమవారం టోలిచౌకి మేరాజ్ కాలనీలో వివిధ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టోలిచౌకి డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రతి ఏటా వరద ముంపు సమస్య ఉండేదని, కార్వాన్ ఎమ్మెల్యే చొరవతో సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో అత్యాధునిక డ్రైనేజీలు, వరద నీటి పైప్‌లైన్‌లు వేసినట్లు తెలిపారు. శాతం చెరువులో పూడిక తీత పనులు పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అజీజ్‌ఖాన్ పఠాన్, అలీమొద్దీన్, సయ్యద్ జబ్బార్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.